కోనో.. మొత్తానికే వద్దమ్మో..!

- చెట్ల కొమ్మలు కొట్టడంతో ఆగొద్దు..
- కూకటివేళ్లతో తొలగించాలంటున్న వృక్షశాస్త్రవేత్తలు
- కోనోకార్పస్ పుప్పొడితో అనారోగ్యం
- నిషేధమున్నా.. నిర్మల్‌లో పాక్షికంగానే తొలగింపు



జిల్లాకేంద్రంలో ఏపుగా పెరిగిన కోనోకార్పస్ చెట్లు (ఫైల్)



కొమ్మలు కొట్టేసిన తర్వాత ఇలా..

నిర్మల్: 'పచ్చని ఆ చెట్లు చూస్తుంటే ముచ్చటేస్తుంది. ఏపుగా ఎంత బాగా పెరిగాయో కదా.. అనిపిస్తుంది. కానీ ఆ మొక్కలు పెరిగి.. పుప్పొడి దశకు చేరితే.. ఎదురయ్యే ఇబ్బందులే 'వద్దురా బాబు.. ఇలాంటి చెట్టు..'అన్న మాటొస్తుంది. ఇంతకు ఇదేం చెట్టు అంటారా..!? అదేనండి.. మన ఊళ్లో రోడ్ల మధ్యలో, రహదారులకు ఇరువైపులా ఏపుగా, పచ్చగా పెరిగిన కోనోకార్పస్. గత దశాబ్దకాలంలో గల్లీల్లు, రోడ్లు, బడులు, గుడులు, ఆఫీసులు, ఆస్పత్రులు, అక్కడా ఇక్కడా అని కాదు.. ఎక్కడ పడితే అక్కడ నాటేశారు. పెట్టిన చెట్లు పెరగాలన్న లెక్కే తప్పా.. నాటుకుంటున్న ఆ చెట్లతో కలిగే లాభనష్టాలను లెక్కించలేదు. ఆ ముందుచూపు లేనితనమే ఇప్పుడు పరేషాన్ చేస్తోంది. కోనోకార్పస్‌తో లాభాల మాట దేవుడెరుగు.. దాని పుప్పొడి ప్రజారోగ్యంపై దుష్ప్రభావం చూపుతుందని వృక్ష శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇప్పటికే దీనిపై నిషేధం విధించారు. కొన్నిచోట్ల విధిలేక పుప్పొడి దశకు చేరే సమయంలో కొమ్మలు కొట్టేస్తున్నారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో అదే చేస్తున్నారు. కానీ.. వీటి గురించి తెలిసిన వృక్షశాస్త్రవేత్తలు కూకటివేళ్లతో ఈ చెట్లను తీసేయాలని అధికారులను కోరుతున్నారు.

అందుకే వద్దంటున్నారు..

'అరె.. మంచిగా పెరిగిన చెట్ల కొమ్మలను ఇలా ఎందుకు కొట్టేస్తున్నారు..'అని జిల్లాకేంద్రంలో కొట్టేస్తున్న కొమ్మలను చూసి చాలామంది అంటున్నారు. కోనోకార్పస్ గురించి తెలిసిన వాళ్లు మాత్రం ఇప్పటికైనా మంచి పనిచేస్తున్నారు. ఇలా కొమ్మలు కొట్టకుండా మొత్తానికి తీసేసి, పనికొచ్చే మొక్కలు నాటాలని చెబుతున్నారు. ఎందుకంటే.. కోనోకార్పస్ పుప్పొడి కారణంగా పలురకాల అలర్జీలు, శ్వాసకోశ వ్యాధులు, ఆస్తమా వంటివీ వస్తున్నట్లు తేలడమే కారణం. ఇక ఈచెట్టు వేళ్లు భూమిలోతులోకి వెళ్లి కేబుళ్లు, పైపులనూ ధ్వంసం చేస్తోంది. వీటిని కనీసం పశువులు కూడా తినవు. చాలారకాల పక్షులు సైతం గూళ్లు పెట్టవు. వీటి పువ్వులు, పుప్పొడిపై సీతాకోక చిలుకలు కూడా వాలవంటే.. ఆ చెట్టు సంగతేందో అర్థం చేసుకోవచ్చు.

మొత్తానికే తీసేయాలి..

కొన్నేళ్లుగా 'సాక్షి'సైతం 'కోనోకార్పస్ కోరల్లో..'అంటూ పలు కథనాల ద్వారా ఈ చెట్ల ప్రభావాన్ని అధికార యంత్రాంగం దృష్టికి తీసుకొచ్చింది. ప్రతీసారి కొమ్మలను కొట్టడంతోనే సరిపెడుతూ వస్తున్నారు. ఇటీవల జిల్లాకు వచ్చిన ఉన్నతాధికారిణి సైతం ఈ చెట్లను ఇలా పెంచడం సరికాదన్న విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈక్రమంలో తాజాగా జిల్లాకేంద్రంలోని డివైడర్ల మధ్యలో పెట్టిన చెట్లను, కొమ్మలను కొట్టే పని చేపడుతున్నారు. కానీ.. ఇలా కొమ్మలను మాత్రమే కట్ చేసి వదిలేయడం సరికాదని, ఇప్పటికైనా మొత్తానికే ఈ చెట్లను తీసేయాలని జిల్లావాసులు కోరుతున్నారు. వాటి స్థానంలో కదంబం, బోగన్ విలియాగ్లాబ్రా(కాగితంపూలచెట్టు), డురంటా ఎరెక్టా(గంటపూల చెట్టు), క్లైరోడెండ్రం ఇనెర్మా(ఫెన్సింగ్‌చెట్టు) ఫైకస్‌పాండా, చమన్‌వంటి మొక్కలను పెంచాలని సూచిస్తున్నారు. ఇలా ప్రతీసారి కొమ్మలను కొట్టడం వల్ల అదనపు ఖర్చు తప్పా.. ఎలాంటి లాభం ఉండదని పలువురు పేర్కొంటున్నారు.

ఆరోగ్య తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, పక్కన ఎమ్మెల్సీ విఠల్

ఖానాపూర్: రాష్ట్రాన్ని ఆరోగ్య తెలంగాణగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. ఆదివారం మండలంలోని ఎర్వచింతల్ గ్రామంలో అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్త) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఎమ్మెల్సీ దండె విఠల్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా సమావేశంలో మాట్లాడారు. ఆప్త తాజా మాజీ అధ్యక్షుడు పన్నెల జనార్దన్ ఓ వైపు దివ్యాంగుల కేంద్రాన్ని కొనసాగిస్తునే మరో వైపు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా ఎర్వచింతల్, కోలాంగూడ, బీర్నంది పంచాయతీల పరిధిలోని సుమారు వెయ్యి మందికి వైద్యపరీక్షలు చేసి రూ.50 వేల విలువైన మందులు పంపిణీ చేశారు. ఆర్థోపెడిక్, కంటిపరీక్షలు, దంత సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో నాయకులు చిన్నం సత్యం, వాల్‌సింగ్, కొడారి గోపాల్, కె.దేవయ్య, గంగ్రత్ ఈశ్వర్, దయానంద్, రమేశ్, నరేశ్, రవి, శంకర్, భీమేశ్, అశోక్, పీడీ విజయలక్ష్మి, వైద్యులు వేణుగోపాలకృష్ణ, ఉప్పు కృష్ణంరాజు, శివ, కిరణ్‌కుమార్, కేహెచ్ ఖాన్, భీంరావు, నితీశ్‌రాజా, రామకృష్ణ, నాగేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన చింతల్‌పేట్ గ్రామస్తులు

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి పంచాయతీ పరిధిలోని చింతల్‌పేట్ గ్రామస్తులు శనివారం రాత్రి ఉట్నూర్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును కలిశారు. చింతల్‌పేట్ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు.

ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

కుంటాల: మండలంలోని విఠాపూర్ గ్రామానికి చెందిన ఇంద్రసేనారెడ్డి రోడ్డు ప్రమాదంలో, కదం రాజేశ్వర్‌పటేల్ అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. మృతికి కారణాలు తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ అరుణ రమణారావు, లింగారెడ్డి, రాందాస్, లక్ష్మణ్‌పటేల్, కాంత్ పటేల్, సుభాశ్‌పటేల్, ఒడ్నం రమేశ్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

నాణ్యమైన విద్య, భోజనం అందిస్తాం



భోజనం పరిశీలిస్తున్న వెంకటరమేశ్

లోకేశ్వరం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించేందుకు కృషి చేస్తున్నామని ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కేజీబీవీ సందర్శించిన ఎంపీడీవో విద్యార్థినులకు అందిస్తున్న భోజనం పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ కేజీబీవీ సిబ్బంది సమ్మె నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. వారి వెంట ఎంఈవో చంద్రకాంత్, ఈవోపీఆర్డీ సోలమాన్‌రాజ్ ఉన్నారు.

'ఉద్యోగులను భయపెట్టొద్దు'

నిర్మల్ రూరల్: సమ్మె నుంచి తప్పుకోవాలని కేజీబీవీల స్పెషలాఫీసర్లను అధికారులు భయాందోళనకు గురిచేయడం సరికాదని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోడిశెట్టి రవికాంత్, వహీద్‌ఖాన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 20రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు సమ్మె చేస్తుండగా కొన్ని జిల్లాల్లో అధికారులు వారిని భయపెడుతున్నారని ఆరోపించారు. సమ్మె కారణంగా జరిగే నష్టానికి ఎస్వోలను బాధ్యులను చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకోవాలని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. డిమాండ్లు నెరవేర్చే వరకు సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మెకు టీయూటీఎఫ్ అండగా ఉంటుందని పేర్కొన్నారు.

గజ్జలమ్మ ఆలయంలో పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో ఆదివారం భక్తుల సందడి కనిపించింది. మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి నైవేద్యంగా బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, అలంకరణ, అర్చన, పల్లకిసేవ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం పట్టణ మనుమయ (కమ్మరి, వడ్రంగి) సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా రామతీర్థం, అధ్యక్షుడిగా అక్కనపల్లి నరేశ్, ప్రధాన కార్యదర్శిగా మందాజి మారుతి, కోశాధికారిగా చంద్రశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా నూతన కమిటీని సంఘ సభ్యులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

108లో ప్రసవం



పుట్టిన బిడ్డతో 108సిబ్బంది, ఆశ కార్యకర్త

పెంబి: పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ఆడబిడ్డకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళితే.. పెంబి మండలంలోని నాగాపూర్ గ్రామంలో పూజ అనే గర్భిణికి ఆదివారం ఉదయం పురిటి నొప్పులు రాగా 108కు సమాచారమిచ్చారు. సిబ్బంది వచ్చి వాహనంలో ఆసుపత్రికి తీసుకెళ్తుండగా అడవి సారంగాపూర్ గ్రామం వద్ద ప్రసవమైంది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని.. వారిని ఖానాపూర్ పీహెచ్‌సీకి తరలించినట్లు 108 సిబ్బంది కృష్ణ, రాకేశ్, ఆశావర్కర్ వినోద తెలిపారు.

బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుల ఎన్నిక



భైంసాలో బూత్ అధ్యక్షులతో బీజేపీ నాయకులు



కడెం : చిన్నబెల్లాల్‌లో బూత్ కమిటీ కార్యవర్గం

భైంసాటౌన్: పట్టణంలోని కిసాన్‌గల్లిలో ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోపాల్ సర్దా ఆధ్వర్యంలో బూత్ కమిటీలకు అధ్యక్షులను ఎన్నుకున్నారు. 148, 149, 151, 152వ బూత్ కమిటీలకు అధ్యక్షులుగా ఆకుల ప్రవీణ్, గోవర్ధన్, తురాటి కిరణ్, నాగేశ్‌ను నియమించారు. అనంతరం వారిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పడిపల్లి గంగాధర్, అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్, నాయకులు గాలి రవి, బూత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కడెం: మండలంలోని ఆయా గ్రామాల్లో పోలింగ్ బూత్ కమిటీలను ఆదివారం ఎన్నుకున్నట్లు బీజేపీ మండలాధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్ పేర్కొన్నారు. చిన్నబెల్లాల్‌లో బూత్ కమిటీ అధ్యక్షుడిగా నేతి వెంకటేశ్, మొర్రిగూడెంలో అధ్యక్షుడిగా దుమ్మని నవీన్, నర్సాపూర్‌లో అధ్యక్షుడిగా పెంద్రం తిరుపతిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జక్కుల సత్తెన్న, ముల్కి కృష్ణ, తిరుమల్, రాజన్న, సోమయ్య, శ్రీరాం తదితరులున్నారు.

కుంటాల: మండలంలోని అంబకంటి, అంబకంటి తండాలో ఆదివారం బీజేపీ పోలింగ్ బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. అంబకంటిలో 71వ బూత్ అధ్యక్షుడిగా భాస్కర్, కార్యదర్శిగా బండి రమేశ్, 72వ బూత్ అధ్యక్షుడిగా బి.ఎల్.పోతన్న, కార్యదర్శిగా గాజ గణేశ్, అంబకంటితండాలో 73వ బూత్ అధ్యక్షుడిగా రమేశ్‌రాథోడ్, కార్యదర్శిగా జాదవ్ అరవింద్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి కొట్టె అశోక్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి సాయి సూర్యవంశీ, శక్తి కేంద్రం ఇన్‌చార్జి ముత్తేశ్, నారాయణ, చౌహన్ రాజు, ఆడె సత్యన్, దత్తు, అశోక్‌రెడ్డి, గోపాల్, నవీన్, సుందర్ అంబాజీ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే



ఖానాపూర్‌లో సర్వే పరిశీలిస్తున్న అధికారులు



బోంద్రట్‌లో సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీవో సమద్

ఖానాపూర్: లబ్ధిదారుల గుర్తింపునకు ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ముమ్మరంగా చేపట్టారు. గోసంపల్లె, దిలావర్‌పూర్ గ్రా మాల్లో కొనసాగుతున్న సర్వేను ఎంపీవో రత్నాకర్‌రావు పర్యవేక్షించారు. పట్టణంలోని ఐదో వార్డు పరిధిలో జరిగిన సర్వేను కౌన్సిలర్ పరిమి లత సురేశ్ పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తానూరు: మండలంలోని బోంద్రట్, బోరిగాం, తానూరు గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆదివారం ఎంపీడీవో అబ్దుల్ సమద్ పరిశీలించారు. సర్వేల వివరాలను పంచాయతీ కార్యదర్శులకు వివరించారు. ఈసందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారి వెంట ఎంపీవో నసీరుద్దీన్, ఈజీఎస్ ఏపీవో గంగాధర్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా చదువుకోవాలి



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న సంఘం నాయకులు

భైంసాటౌన్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మాల ఉద్యోగుల సంఘం భైంసా డివిజన్ నాయకులు అన్నారు. ఆదివారం పట్టణంలోని బుద్ధవిహార్‌లో బుద్ధవిహార్ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బౌద్ధగురువు భంతే నాగవంశ్ అమరావతి సుమారు 200 మంది విద్యార్థులకు ప్రవేశపరీక్షల స్టడీ మెటీరియల్, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు, డిక్షనరీలు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం దక్కుతాయని.. ప్రతిఒక్కరూ మంచిగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ అధ్యక్షుడు లక్ష్మణ్ జాడే, కన్వీనర్ ధర్మాజీ చందానే, ఉపాధ్యక్షులు ధర్మరాజు దగ్డే, అనురత్, సూర్యదాస్, గౌరవాధ్యక్షుడు రాజారాం దాసరి, బుద్ధవిహార్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడి పరామర్శ

మామడ: మండలంలోని గాయిద్‌పల్లి గ్రామానికి చెందిన సురేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా.. అతడిని ఆదివారం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన జాదవ్ హిమబిందు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించినందుకు ఆమెను అభినందించారు. కార్యక్రమంలో సంతోష్, రామారావు, విజేశ్, మంగ్యానాయక్ తదితరులు ఉన్నారు.

'మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి'

కడెం: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టేందుకు ఆయన సేవలకు గుర్తుగా భారతరత్న పురస్కారం అందించాలని పేర్కొన్నారు.

నమ్మండి.. కాలువే ఇది..!



భైంసా-బాసర మార్గం పక్కనే కాలువ దుస్థితి



వాలేగాం మార్గంలో ప్రమాదకరంగా కాలువ గట్టు

- అస్తవ్యస్త నిర్వహణతో దెబ్బతిన్న ఖైనం
- చివరి ఆయకట్టుకు అందని సాగునీరు



భైంసాలోని బాసర వెళ్లే రోడ్డులో పిచ్చిమొక్కలతో కాలువ

భైంసాటౌన్: భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టు కాలువ దుస్థితికి నిదర్శనం ఈ చిత్రాలు. ప్రాజెక్టు నుంచి భైంసా, లోకేశ్వరం మండలాల్లోని దాదాపు 14వేల ఎకరాలకు సాగునీరందించే కాలువ దుస్థితి ఇది. డ్రెయినేజీ కంటే అధ్వానంగా ఉంది. కాలువలో, గట్టుపై పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. కాలువ పొడవునా సీసీ లైనింగ్ లేకపోవడంతో కొన్నిచోట్ల గండ్లు పడి రైతులు పంటలను నష్టపోతున్నారు. కాల్వ నిర్వహణపై సంబంధిత అధికారుల నిర్లక్ష్యానికి తోడు పాలకుల పట్టింపు కరువైంది. దీంతో రైతులకు పూర్తిస్థాయిలో చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు.

పట్టణంలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టు నుంచి భైంసా మండలం మీదుగా లోకేశ్వరం మండలంలోని రాజురా వరకు 42 కిలోమీటర్ల మేర కాలువ నిర్మించారు. ఈ కాల్వ 14వేల ఎకరాలకు సాగునీరందించాల్సి ఉంది. కానీ ఈ కాలువ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రస్తుతం 31కిలోమీటర్ల వరకే ఉండగా తొమ్మిది వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందిస్తున్నట్లు ప్రాజెక్టు డీఈఈ అనిల్ తెలిపారు. కాలువ బాగు చేసేందుకు రూ.50కోట్ల నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించొద్దు

నిర్మల్‌టౌన్: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించవద్దని ఎస్పీ జానకీ షర్మిల హెచ్చరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్ వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

లక్ష్మణచాంద: మండల ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై సుమలత ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిసెంబర్ 31 వేడుకలు ఇళ్లలోనే జరుపుకోవాలని కోరారు. గంజాయి, మాదకద్రవ్యాలు వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్లపై గుంపులుగా ఉండటం, కేక్‌లు కట్ చేయడం వంటివి చేయొద్దని సూచించారు.

కుంటాల: డిసెంబర్ 31న న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించడం నిషేధమని ఎస్సై సీహెచ్.భాస్కరాచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, బైక్‌లపై మైనర్లతోపాటు ట్రిపుల్ రైడింగ్ చేయరాదని హెచ్చరించారు.

పదో రోజుకు 'మధ్యాహ్న' కార్మికుల సమ్మె




ఎద్దుకు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

తానూరు: తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు తహసీల్దార్ కార్యాలయం ముందు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 10వ రోజుకు చేరింది. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ తొమ్మిది నెలలుగా మాకు బిల్లులు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న గౌరవ వేతనం రూ.10 వేలకు పెంచి అందించి సకాలంలో బిల్లులు చెల్లించాలని కోరారు. అనంతరం ఎద్దుకు వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో గంగాధర్, భారత్‌బాయి, సావిత్రిబాయి, గంగాధర్, ఆయా గ్రామాల కార్మికులు పాల్గొన్నారు.

నేడు 'చలో కలెక్టరేట్'

ఖానాపూర్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ ఈనెల 30న జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న కార్మికులకు మద్దతుగా బైటాయించి మాట్లాడారు. ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెంటనే మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం వారసంతలో భిక్షాటన చేసి వినూత్న నిరసన తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు లక్ష్మి, విజయ, పద్మ, భాను, నర్సవ్వ, మంజుల, మంగమ్మ తదితరులు ఉన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



బహుమతి అందిస్తున్న సుదర్శన్

నర్సాపూర్(జి): యువత క్రీడల్లో రాణించి మండలానికి పేరు తీసుకురావాలని సమత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్ పేర్కొన్నారు. సమత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నర్సాపూర్ (జి) జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో క్రికెట్ టోర్నీ నిర్వహించగా ఆదివారం విజేతలకు బహుమతులు అందించారు. ప్రథమ బహుమతిగా నర్సాపూర్(జి)ఏ జట్టుకు రూ.16వేలు, ద్వితీయ బహుమతి గా గొల్లమాడ జట్టుకు రూ.10వేలు, తృతీయ బహుమతిగా నర్సాపూర్(జి)బీ జట్టుకు రూ.ఐదు వేలతోపాటు ట్రోఫీలను అందించారు. టీఎస్‌జీయూ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, శ్రీనివాస్, పాపెన్ రాజేశ్వర్, గంగాధర్, గజేందర్ పటేల్, వెంకటేశ్‌గౌడ్, సాహెబ్‌రావు, సీఈఓ అనిల్, క్రాంతికుమార్, యోగేశ్ ఉన్నారు.